# ఐద్వా వైరా డివిజన్ కమిటీ ఎన్నిక

● అధ్యక్ష కార్యదర్శులుగా కొండబోయిన ఉమ, గుడిమెట్ల రజిత



**టి మీడియా, అక్టోబర్ 6,అక్టోబర్ 6, వైరా**

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) వైరా డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా కొండబోయిన ఉమ, గుడిమెట్ల రజిత ఎన్నికయ్యారు. సోమవారం వైరా మండలం రెబ్బవరం గ్రామంలో జరిగిన ఐద్వా వైరా డివిజన్ మహాసభలో 24 మంది సభ్యులతో నూతన ఐద్వా వైరా డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. వీరిలో 9 మంది సభ్యులు ఆఫీస్ బేరర్స్‌గా ఎన్నికైనారు. నూతన కమిటీకి కారేపల్లికి చెందిన కొండబోయిన ఉమ అధ్యక్షురాలుగా, వైరాకు చెందిన గుడిమెట్ల రజిత కార్యదర్శిగా ఎన్నికైనారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ, రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మెరుగు రమణ, బండి పద్మ, వైరా డివిజన్ పరిధిలోని ఐదు మండలాల ఐద్వా నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.


ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 30
సంచిక : 41
పేజీలు : 3

బుధవారం, అక్టోబర్ 07, 2025

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ


# దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిష్కరించాలి..

## కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**టి మీడియా, అక్టోబర్ 6,అక్టోబర్ 6,ఖమ్మం:**

ప్రజావాణి దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి ప్రజావాణి దరఖాస్తులు జిల్లా అధికారులు తమ వద్ద పెండింగ్ లేకుండా చూడాలని, దరఖాస్తులను వెంట వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఖమ్మం నగరం వినోబా నవోదయ కాలనీవాసులు హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం భూదాన యజ్ఞ బోర్డు ఇచ్చిన స్థలంలో నివాసాలు ఏర్పరచుకున్న పేద ప్రజలకు విద్యుత్, మంచినీటి వసతి కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కలెక్టరేట్ డి విభాగంకు రాస్తూ ప్రతిపాదనలను సమర్పించాలని కలెక్టర్ అన్నారు.మధిర మండలానికి చెందిన ఊటుకూరు రూతమ్మ, తమకు ప్రభుత్వం ఇచ్చిన ఎకరం భూమికి పట్టా పాస్ పుస్తకం జారీ చేసి రైతు భరోసా వంటి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ మధిరకు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.వైరా మండలం బ్రాహ్మణపల్లికి చెందిన ఎం. రాధ తమకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటిని బేస్మెంట్ వరకు నిర్మించుకున్నామని గ్రామంలో ఉన్న మిగతా లబ్ధిదారులకు డబ్బులు వచ్చాయని, 2 నెలలు గడిచిన తనకు బిల్లు డబ్బులు రాలేదని ఇందిరమ్మ మొదటి బిల్లు ఇప్పించాలని కోరుతూ



దరఖాస్తు చేసుకోగా, పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.వేంసూరు మండలం మర్లపాడు గ్రామానికి చెందిన భీమిరెడ్డి పుల్లారెడ్డి ఎన్టీఆర్ కాలువ మధ్యలో సంచార జాతులకు చెందిన వారు సొంత స్థలాల్లో డేరాలు వేసుకొని నివాసం ఉంటున్నారని, వారికి అవసరమైన డ్రైనేజీ, విద్యుత్ సరఫరా, ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పంచాయతీ రాజ్ ఏఈకు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.సత్తుపల్లి మండలానికి చెందిన నాగమణి తనకు ఒంటరి పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఎంపిడిఓకు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఇట్టి ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నికలకు సమయం పట్టొచ్చు...!

**టి మీడియా, అక్టోబర్ 6,అక్టోబర్ 6, సత్తుపల్లి**

స్థానిక ఎన్నికల సంగ్రామ సమరానికి కొంత సమయం పడితే పట్టొచ్చు గాని, ఎన్నికలు జరగడం మాత్రం పక్కా అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య స్పష్టం చేశారు. సోమవారం స్థానిక లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాలులో బీఆర్ఎస్ రూరల్ మండల నాయకులు, ముఖ్య కార్యకర్తలతో ఏర్పాటు చేసిన స్థానిక సంగ్రామ సన్నాహక సమావేశంలో సండ్ర ముఖ్య అతిథిగా పాల్గొని గులాబీ శ్రేణులకు పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్లు మారవన్నారు. అయితే ఈ ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలే కదా అనుకొని తేలిగ్గా తీసుకుంటే వాటి ప్రభావం సర్పంచ్ ఎన్నికలపై పడుతుందని సండ్ర పార్టీ శ్రేణులను అప్రమత్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందన్నారు. ఆ వ్యతిరేకతను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం స్థానిక సంగ్రామంలో గులాబీ పార్టీ అభ్యర్థులే విజయం సాధించడం ఖాయమన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సోషల్ మీడియా యాక్టివిస్టలను పోలీసు స్టేషన్లకు పిలిపించే సంద్రాయానికి తెరలేపారన్నారు. రైతుల అవసరం మేరకు యూరియాను కూడా అందించలేక పోయారన్నారు. మనం అధికారంలో ఉన్నప్పుడు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రెగ్యులర్‌గా లబ్ధిదారులకు అందించామన్నారు. తులం బంగారం హామీ ఎక్కడకి పోయిందో తెలియదన్నారు. సత్తుపల్లిలో మన హయాంలో పూర్తిచేసిన 100 పడకల ఆసుపత్రిని ఇంత వరకు ప్రారంభించలేదన్నారు. పాత ఆసుపత్రి భవనంలోనే వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. దసరా పండుగకు బతుకమ్మ చీరలు, క్రిస్మస్ కానుకలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చేవాళ్లమన్నారు. కాంగ్రెస్ కండువా కప్పుకున్నోళ్లకే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నారన్నారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కూసంపూడి రామారావు, నాయకులు దొడ్డా శంకరరావు, మాదిరాజు బంగార్రాజు, మందపాటి శ్రీనివాసరెడ్డి, మోదుగు పుల్లారావు, మందపాటి వెంకటరెడ్డి, కాల్నేని వెంకటేశ్వరరావు, మాదిరాజు వాసుదేవరావు, కోటమర్తి సుజాతరావు పాల్గొన్నారు.

# కోటమైసమ్మ జాతర హుండి లెక్కింపు

## జాతర ఆదాయం రూ.29.10 లక్షలు

**టీ మీడియా, అక్టోబర్,06, సింగరేణి (కారేపల్లి) :**

కారేపల్లి మండల ఉసిరికాయలపల్లి శ్రీకోటమైసమ్మ తల్లి ఆలయం ప్రాంగణంలో దసరా సందర్భంగా 5 రోజుల పాటు జరిగిన జాతర సోమవారం తో ముగిసింది. జాతర హుండీ, ఇతర ఆదాయాలను అధికారులు సోమవారం లెక్కించారు. ఈ ఏడాది జాతర అన్ని ఆదాయాలు కల్పుకోని రూ.29.10 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ డాక్టర్ పర్సా పట్టాబి రామారావు, ఆలయ ఈవో వేణుగోపాలచార్యులు తెలిపారు. ఖమ్మం దేవాదాయ ఇన్‌స్పెక్టర్ ఈ.వెంకటేశ్వర్లు సమక్షంలో హుండీల లెక్కింపును చేపట్టారు. గత ఏడాది కంటే కేవలం రూ.1.92 లక్షల ఆదాయం పెరిగింది. జాతరలో దుకాణాల వేలం హక్కుల ద్వారా రూ.9.65 లక్షలు, హుండి ఆదాయం రూ. 7.42 లక్షలు, పూజా టిక్కెట్ల మ్మకాల ద్వారా రూ. 4.95 లక్షలు, షాపులకు స్థల కిరాయిల ద్వారా రూ. 5.41 లక్షలు అమ్మవారి చీరల వేలం ద్వారా రూ. 80 వేలు, వాహన పూజ ల్కెసెన్స్ ద్వారా రూ. రూ.84 వేలు వచ్చినట్లు ఆధికారులు తెలిపారు. జాతరలో పూజల నిర్వాహణ ద్వారా వచ్చే ఆదాయం గత ఏడాదితో పోల్చితే రూ.56 వేలు తగ్గగా, వేలం, హుండి, షాపుల కిరాయిల ద్వారా ఆదాయం గణనీయంగా పెరిగింది. జాతర విజయవంతానికి కృషి చేసిన పోలీసు



శాఖ, దేవాదాయశాఖ సిబ్బంది, వైద్యశాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ఉసిరికాయలపల్లి గ్రామస్తులు, వాలంటీర్లకు, మీడియాకు ఆధికారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు చాగంటి వెంకటేశ్వర్లు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# 26 నుండి భారత్ గౌరవ్ రైలు యాత్ర

## -సామాన్యులకు అందుబాటులో ధరలు

## -అసిస్టెంట్ మేనేజర్ పివి వెంకటేష్

**టీమీడియా, అక్టోబర్ 6,ఖమ్మం :**

ఈ నెల 26 నుండి నవంబర్ 4 వరకు తెలుగు ప్రజల కోసం ప్రత్యేక పర్యాటక రైలు (భారత్ గౌరవ్ రైలు) అందుబాటులో ఉందని, ఖమ్మం ప్రజలు వినియోగించుకోవాలని సౌత్ సెంట్రల్ జోన్ ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఆర్‌సిటిసి) టూరిజం




అసిస్టెంట్ మేనేజర్ పివి వెంకటేష్ పేర్కొన్నారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం యాత్ర వివరాలు వెల్లడించారు. ఈ తీర్థయాత్రలో భాగంగా ద్వారకాదీప్ మందిరం, నాగేశ్వర జ్యోతిర్లింగ మందిరం, భేట్ ద్వారక, సోమనాధ్ జ్యోతిర్లింగ మందిరం, సబర్మతి ఆశ్రమం, సూర్యదేవాలయం, రాణికి వావ్, సర్దార్ వల్లాభాయ్ పటేల్ విగ్రహం తదితర ప్రదేశాల సందర్శన ఉంటుందని తెలిపారు. సామాన్యులకు ధరలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఒక్కొక్కరికి స్లీపర్ 18400, 3ఏసి 30200, 2ఏసి 39900 రూపాయల టికెట్ ధర ఉంటుందన్నారు. ఈ ప్యాకేజీలో మూడు పూటల భోజన వసతి, రవాణా సౌకర్యాలు, ప్రతి కోచ్‌లో ఐఆర్‌సిటిసి సిబ్బంది అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని

మిగతా 3లో



## దొంతి కాంతమ్మకు నివాళులర్పించిన ఎంపీ

**టీ మీడియా, అక్టోబర్ 6,ఖమ్మం:**నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి మాతృమూర్తి దొంతి కాంతమ్మ ఇటీవల మరణించగా.. ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి సోమవారం హన్మకొండలోని వారి నివాసానికి వెళ్లి.. శ్రద్ధాంజలి ఘటించారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాంతమ్మ గారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి.. ఓదార్చారు. అండగా ఉంటామని అభయమిచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ డిసిసి అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ మంత్రి బస్వరాజు సారయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వరద రాజేశ్వరరావు, పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.



## పారిశుధ్య కార్మికునికి ఏఐటియుసి నివాళి

### -కార్పొరేటర్ బిజి క్లైమెంట్

**టీ మీడియా, అక్టోబర్ 6,ఖమ్మం :** గుండెపోటుతో మరణించిన 43వ డివిజన్ మున్సిపల్ క్వార్టర్స్ నివాసం ఉండే కడియాల వీరబాబు (48)కు ఏఐటియుసి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. గతంలో ఖమ్మంలో పారిశుధ్య కార్మికునిగా పనిచేసి ఇటీవల జవాన్గా పదోన్నతి పొందిన వీరబాబు సోమవారం తెల్లవారు జామున తీవ్రమైన గుండెపోటుకు గురై మరణించాడు. –వీరబాబుకు భార్య నాగమణి, కుమార్తెలు స్మృతి, మహేశ్వరి లు ఉన్నారు. మృతి వార్త తెలిసిన వెంటనే ఏఐటియుసి జాతీయ –సమితి సభ్యులు, 43వ డివిజన్ కార్పొరేటర్ బిజి క్లైమెంట్ అక్కడకు చేరుకుని వీరబాబు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరబాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా క్లైమెంట్ మాట్లాడుతూ వీరబాబు కుటుంబంలో ఒకరికి వెంటనే కార్పొరేషన్లో ఉపాధి కల్పించాలని కోరారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలా ఆదుకోవాలని అందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని ఆయన తెలిపారు. నివాళులర్పించిన వారిలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు గాదె –లక్ష్మి నారాయణ, తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుర్రి ఉపేందర్, నగిరికంటి కృష్ణ, సహాయ కార్యదర్శి తాళ్లపల్లి రాములు, నాయకులు ఇటికాల వెంకటేశ్వర్లు, నాగేంద్రబాబు, –రమేష్, పాకాలపాటి సంపత్, బంగారి, సిపిఐ నాయకులు రాంబాబు, కటుకూరి సతీష్రెడ్డి, నాగేశ్వరరావు, హుస్సేన్ తదితరులు ఉన్నారు.

## గ్రూప్ 2 ఉద్యోగం సాధించిన వడ్డే సాయి భార్గవ్‌కు ప్రమీల సన్మానం

**టీ మీడియా, అక్టోబర్ 6, తల్లాడ**

మండల పరిధిలోని కలకోడిమ గ్రామానికి చెందిన వడ్డే సాయి భార్గవ్ గ్రూప్ 2 ఫలితాల్లో డిప్యూటీ తహసీల్దార్‌గా ఉద్యోగం సాధించారు. భార్గవ్‌ను మాజీ జెడ్పీటీసీ దిరిశాల ప్రమీల, బీఆర్ఎస్ పార్టీ జోనల్ చైర్మెన్ దిరిశాల దాసు రావు సోమవారం సన్మానించారు. సాయి భార్గవ్ సామాన్య రైతు కుటుంబానికి చెందిన యువకుడు. చిన్ననాటి నుండి చదువులో రాణిస్తూ గురుకులాలలో విద్యాభ్యాసం చేశారు. గతంలో గ్రూప్ ఫోర్ ఉద్యోగం రాసి జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మరల ఉన్నత స్థాయి ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివి గ్రూప్-2 రాయడంతో డిప్యూటీ తహసీల్దార్‌గా ఉద్యోగం సాధించారు. తమ గ్రామానికి చెందిన యువకుడికి ఉద్యోగం రావటం పట్ల ప్రమీల దంపతులు అభినందనలు తెలిపారు.



## ఎంపీ వద్దిరాజును సత్కరించిన మున్నూరుకాపు ప్రముఖులు

**టీ మీడియా, అక్టోబర్ 6,ఖమ్మం :**రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను మున్నూరుకాపు ప్రముఖులు సోమవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.ఎంపీ రవిచంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం సభ్యులుగా తిరిగి నియమితులైన సందర్భంగా బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుటం పురుషోత్తమ రావు, సంఘం అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ మీసాల చంద్రయ్య,సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు బండి పద్మక్క, సంఘం కార్యనిర్వహక కార్యదర్శి యాంజాల పద్మయ్య,రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షులు చందు జనార్ధన్,సంఘం ప్రముఖులు ఎర్రా నాగేంద్రబాబు,ఉపాధ్యాయుల సూర్యప్రకాశరావు తదితరులు కలిసి శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



## దుర్గామాత విగ్రహ ప్రతిష్టాపనలో బాదం ప్రవీణ్

### అమ్మవారికి రైస్ మిల్లర్స్ప్రత్యేక పూజలు

**టీ మీడియా, అక్టోబర్ 6,ములుగు జిల్లా ప్రతినిధి:**

ములుగు మండలంలోని రామచంద్రపురం గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన దుర్గామాత దేవాలయంలో సోమవారం రోజున అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రైస్ మిల్లర్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాదం ప్రవీణ్ ముఖ్యఅతిథిగా హాజరై దుర్గామాత విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బాదం ప్రవీణ్ తో పాటు రైస్ మిల్లర్ అసోసియేషన్ సభ్యులు దుర్గామాత కు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామస్తులు రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ తో పాటు రైస్ మిల్లర్ అసోసియేషన్ సభ్యులను సాల్వలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.



## జిల్లా ప్రధాన ఆస్పత్రిలో లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభం

● **జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఖమ్మం కార్యదర్శి కెవి చంద్రశేఖర్ రావ్**

**టీ మీడియా, అక్టోబర్ 6, ఖమ్మం**

రాష్ట్ర న్యాయాధికార సంస్థ హైదరాబాద్, జిల్లా ప్రధాన న్యాయ మూర్తి ఖమ్మం, ఆదేశానుసారం ప్రభుత్వ ఆస్పత్రి ఖమ్మం నందు సోమవారం ప్రత్యేక ఎయిడ్ సెంటర్/ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఖమ్మం కార్యదర్శి కెవి చంద్రశేఖర్ రావ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రమంతటా ప్రతి జిల్లా కేంద్రంలో ఒకటి చొప్పున లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభించారని దీని ద్వారా జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. డ్రగ్స్ కు బానిసైన వారికి హాస్పిటల్స్ లో ఎటువంటి ఇబ్బందులు కల్గిన వారు లీగల్ ఎయిడ్ సెంటర్ ను సంప్రదించి తగు సహాయం పొందవచ్చని అన్నారు. ప్రతి శనివారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు సెంటర్ అందుబాటులో వుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ సౌమ్య, ఇతర డాక్టర్లు సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్స్ పాల్గొన్నారు.



## కనీస వేతనాలు అమలు చేయాలని వినతి

### ఐఎన్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.సీతారామయ్య

**టీ మీడియా, అక్టోబర్ 6, కొత్తగూడెం :** ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, మధ్యాహ్న భోజన, హాస్టల్ వర్కర్స్, అంగన్‌వాడీ, హెల్త్, మున్సిపల్, గ్రామ పంచాయతీ తదితర స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఐఎన్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.సీతారామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐఎన్టీయూ నాయకులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్మిక శాఖ అధికారి షరీఫుద్దీన్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేసి మాట్లాడారు. కనీస వేతనంతో పాటు 8 గంటల పని విధానం, ఈఎస్ఐ, పీఎఫ్, సామాజిక భద్రత, చట్టబద్ధమైన సౌకర్యాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత 20 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన, హాస్టల్ వర్కర్స్ సమస్య పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని అధికారులను కోరారు.పరిశ్రమలలో పని చేస్తున్న మహిళలు అనేక రకాలుగా వేధింపులకు గురవుతున్నారని, వారికి రక్షణ కల్పించాలని, సంఘటిత, అసంఘటిత రంగాల్లో దేశంలో సుమారు 70 కోట్ల మంది కార్మికులు పని చేస్తున్నారని, వారి ప్రయోజనాల కోసం ఆలోచన చేయాలని విన్నవించారు. కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న వైఖరి వల్ల కార్మికులు అభద్రతాభావానికి లోనవుతున్నారని, కార్మిక సంక్షేమం కోసం పాటుపడకుండా నిర్లక్ష్యం వహించడం వల్ల అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా కండ్లు తెరిచి కార్మిక సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, లేనిపక్షంలో ఆందోళనలను కొనసాగిస్తామని హెచ్చరించారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాయకులు గౌని నాగేశ్వరరావు, మల్లికార్జునరావు, మంకెన వెంకటేశ్వరరావు, శరత్ ఉన్నారు.

## ముత్తారం హైస్కూల్ గ్రౌండ్లో చెట్టుపై పడిన పిడుగు

**టీ మీడియా, అక్టోబర్ 6, ముదిగొండ**

సోమవారం మిట్ట మధ్యాహ్నం వాతావరణంలో మార్పుల చోటుచేసుకుని మబ్బులు పట్టి ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షంలో మండల పరిధిలో వనంవారికిష్టాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణంలో ఉన్న గిన్నె చెట్టుపై పిడుగు పడింది. పిడుగు వృక్షాన్ని నిట్ట నిలువునా చీల్చింది. దీంతో పిడుగు శబ్దానికి పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు భయభ్రాంతులకు గురై కేకలు వేశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

## రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

**టీ మీడియా, అక్టోబర్ 6, బోనకల్**

మండల పరిధిలోని తూటికుంట్ల గ్రామానికి చెందిన గండమాల సారథి(34) బోనకల్ రైల్వే స్టేషన్ పరిధిలోని రైల్వే విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద గుర్తుతెలియని రైలు కిందపడి సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గండమాల సారథికి భార్య, ఒక కుమార్తె ఉంది. అయితే భార్యాభర్తల మధ్య గత కొంతకాలంగా తీవ్ర ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భార్య లక్ష్మి సుమారు రెండేళ్ల క్రితం భర్తను వదిలి వెళ్లిపోయింది. కుమార్తె మాత్రం తండ్రి సారథి వద్దనే ఉంటుంది. ఈ క్రమంలో భార్య రావటం లేదని సారథి తీవ్ర మనస్థాపానికి గురైయ్యాడు. మద్యానికి బానిసగా మారాడు. మనోవేదనతో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

## ఎన్నికలకు బీఆర్ఎస్ సిద్ధం కావాలి : సండ్ర

**టీ మీడియా, అక్టోబర్ 6, ఎనుబల్లి**

స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకత్వం సిద్ధం కావాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పిలుపునిచ్చారు. పెనుబల్లి మండల కేంద్రంలోని వీఎం బంజర సప్తపది ఫంక్షన్ హాల్‌లో మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం జరిగింది. స్థానిక సంస్థల ఎన్నికల, అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేయాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో వైఫల్యం చెందిందని, ఆ పార్టీ వైఫల్యాలను ఎండగడుతూ గ్రామ గ్రామాన ప్రచారం నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో నాయకత్వంతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసుకొని స్థానిక ఎన్నికల నిర్వహణపై సమగ్రంగ చర్చించుకోవాలని సూచించారు. ఎన్నిక నిర్వహణకు గ్రామస్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ నాయకులు కనగాల వెంకటరావు, చెక్కిలాల లక్ష్మణరావు, చెక్కిలాల మోహన్ రావు, చెలికాని నీలాద్రి బాబు, కోటగిరి సుధాకర్ బాబు, కొప్పుల గోవిందరావు, పాల్గొన్నారు.

# మాజీ ఎంపీ నామ ఆశీర్వాదాలు, పరామర్శలు



**టీ మీడియా, అక్టోబర్ 6,ఖమ్మం :**బిఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు సోమవారం ఖమ్మం నగరంలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు కుటుంబాలను పరామర్శించారు. అలాగే కాబోయే వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ముందుగా ఖమ్మం పట్టణం, టీఎన్జీవో ఫంక్షన్ హాల్ లో రిటైర్డ్ టీచర్ నాగబత్తిన భాస్కర్ కుమారుడు వివాహ నిశ్చితార్థ వేడుకలో పాల్గొని కాబోయే వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రముఖ వ్యాపారవేత్త, మార్కెట్ దిగుమతి శాఖ సీనియర్ సభ్యులు గొడవర్తి రామారావు ఇటీవల మృతి చెందిన విషయం విదితమే. ఈ సందర్భంగా సోమవారం వీడియోస్ కాలనీలోని వారి కుమారుడు స్వగృహం కు వెళ్లి రామారావు చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుమారులు గొడవర్తి శ్రీనివాసరావు, నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. తర్వాత ప్రముఖ ఛాతి వైద్యనిపుణులు డాక్టర్ కిషోర్ బాబు తండ్రి సాతంబేడు ముని రామయ్య ఇటీవల మృతి



చెందగా నెహ్రూనగర్ లోని వారి స్వగృహానికి నామ వెళ్లి రామయ్య చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించి, కిషోర్ బాబు కుటుంబ సభ్యులను పరామర్శించినారు. ఈ కార్యక్రమాల్లో నామతో పాటు కనకమేడల సత్యనారాయణ, బాణాల వెంకటేశ్వర్లు, గోడ్డేటి మాధవరావు, మోరంపూడి ప్రసాదరావు, చావా రాము, చిగురు ప్రభాకర్, తన్నీరు రవి, పాల్గొన్నారు.




## వేదపండితుని కుటుంబానికి వితరణ

**టీ మీడియా, అక్టోబర్ 06, సింగరేణి (కారేపల్లి) :** కారేపల్లి మండలం మాణిక్యారంకు చెందిన ప్రముఖ వేద పండితులు పంతంగి మాధవశర్మ ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబానికి మాణిక్యారంకు చెందిన తుళ్లూరి పురుషోత్తం, వీరభద్రం, భారతిరాణి లు 75 కేజీల బియ్యంతో పాటు ఇతర నిత్యావసర వస్తువులను సోమవారం మాధవశర్మ కుమారుడు రాఘవశర్మ కు అందజేశారు. ఈసందర్భంగా దివంగత మాధవశర్మ ఈ ప్రాంతంలో చేసిన సేవలను గ్రామస్తులు కొనియాడారు. వేదాలు తెలిసిన వ్యక్తిగా ఎలాంటి గర్వం లేకుండా అందరిని ఆదరించే మాధవశర్మ వృద్ధాప్య రుగ్మతలతో కొంత కాలంగా బాధపడుతూ మృతి చెందారు.



## గ్రేస్ కాలేజీ లో స్ట్రాంగ్ రూమ్ పరిశీలించిన కలెక్టర్

**టీ మీడియా, అక్టోబర్ 6, కొణిజర్ల**

:మండల పరిధిలో నీ తనికెళ్ల సమీపం లోని గ్రేస్ కాలేజీ నందు జరగబోవు ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలకు సంబంధించిన స్ట్రాంగ్ రూమ్ కౌంటింగ్ హాల్ వద్ద చేయవలసిన ఏర్పాట్లు మరియు తీసుకోవాల్సిన జాగ్రత్తలు జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ హాల్స్ మరియు స్ట్రాంగ్ రూమ్స్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని , రిసెప్షన్ కౌంటర్స్ ఏర్పాట్లు , కౌంటింగ్ ఆల్ లోపల జాలీతో బర్కెటింగ్, రిసెప్షన్ కౌంటర్ కు వచ్చిన ఎలక్షన్ సిబ్బందికి మంచి నీళ్లు మరియు భోజనం వసతులు , రిసెప్షన్ కౌంటర్స్ కు వచ్చు బస్సుల ట్రాఫిక్ నియంత్రణ , స్ట్రాంగ్ రూమ్ వద్ద బందోబస్తు , పకడ్బందీగా నిబంధనకు లోబడి అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్,జిల్లా పరిషత్ సీఈఓ , పిడి డిఆర్డిఏ ,ఆర్డిఓ, పోలీస్ డిపార్ట్మెంట్ , ఈ ఈ పి ఆర్, కొణిజర్ల తాసిల్దార్ అరుణ, కొణిజర్ల,వైరా, చింతకాని మూడు మండలాల ఎంపీడీవో లు తదితరులు పాల్గొన్నారు.



## పోలీసులకు పట్టుబడ్డ 32 పశువులు

**టి మీడియా, అక్టోబర్ 6,పినపాక ప్రతినిధి:**

చర్ల ప్రాంతం నుండి హైదరాబాద్ కబేళాకు లారీలో తరలిస్తున్న 32 పశువులనుబూర్గంపాడు పోలీసులు సోమవారం తెల్లవారుజామున మండల పరిధిలోని జింకలగూడెం గ్రామంలో పట్టుకున్నారు . గతంలో జింకలగూడెం గ్రామంలో పలు మార్లు పశువుల అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన విషయం పాఠకులకు విధితమే. పట్టుబడిన లారీలో 25 ఎద్దులు, 7 ఆవులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన పశువులను పాల్వంచ గోశాలకు తరలించి, పశువుల రవాణాకు పాల్పడ్డ జింకలగూడెం కు చెందిన ఎస్ కే ఇస్మాయిల్, హైదరాబాదుకు చెందిన ఖైజర్ లపై కేసు నమోదు చేసినట్లు అదనపు ఎస్ఐ నాగబిక్షం తెలిపారు.



## ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభించిన ఎమ్మెల్యే

**టి మీడియా, అక్టోబర్ 6,పినపాక ప్రతినిధి:**

మణుగూరు మండలం తోగ్గూడెం గ్రామంలో శ్రీ శ్రీనివాస ఆయిల్ ఫిల్లింగ్ స్టేషన్ (నయరా)ను సోమవారంపినపాక శాసనసభ్యులుపాయం వెంకటేశ్వరు ప్రారంభించారు. అనంతరం ఫిల్లింగ్ స్టేషన్ యజమానులకు శుభాకాంక్షలు తెలిపి పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాణ్యమైన పెట్రోల్ మరియు డీజిల్ ను వినియోగదారులకు అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఫిల్లింగ్ స్టేషన్ నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పీరినాకి నవీన్ , మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, బంకు నిర్వాహకులు, సిబ్బంది, పాల్గొన్నారు.



## అయ్యప్పస్వాముల మాలధారణ

**టి మీడియా, అక్టోబర్ 6,పినపాక ప్రతినిధి:**

సమాజం సన్మార్గంలో నడిచేందుకు అయ్యప్ప మాలధారణ ఎంతగానో దోహదడుతుందని గురుస్వామి జిల్లేపల్లి గోవర్ధన చారి అన్నారు. అందరికీ అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీక మాసం సమీపిస్తున్న నేపథ్యంలో సోమవారం అశ్వాపురం మండల పరిధిలోని మల్లెల మడుగు శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో గురు స్వామి సమక్షంలో 15 మంది అయ్యప్ప మాలధారణ అయ్యప్ప చేపట్టారు.స్వాములు 41 రోజులపాటు ఎంతో పవిత్రత, నిష్టలతో దీక్షలు చేపడతారు.నిత్యం పూజలు, సాయంత్రం వేళ భజనలు చేస్తూ అయ్యప్ప స్వామిని కొలుస్తుంటారు. మొండికుంట, మల్లెలమడుగు, నెల్లిపాక బంజరగ్రామాలకు చెందిన సుమారు 60 మందికి పైగా యువకులు అయ్యప్ప స్వామి మాలధారణ చేపడతారు.

## 26 నుండి భారత్ గౌరవ్ రైలు యాత్ర

కోరారు. మరింత సమాచారం కోసం 97013 60701, 92810 30711, 92810 30749, 92814 95845, 92814 95843 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ మీడియా సమావేశంలో టూరిజం మోడివేటర్లు ప్రశాంత్, జయంతి పాల్గొన్నారు.



## అమ్మానాన్నలకు నామ ఘన నివాళులు

**టి, మీడియా, అక్టోబర్ 6,ఖమ్మం రూరల్:**

బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు మాతృమూర్తి నామ వరలక్ష్మి ఐదవ వర్ధంతి సందర్భంగా, ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెం గ్రామంలోని నామ ముత్తయ్య - వరలక్ష్మి స్మృతివనంను సోమవారం నాడు నామ తన సోదరులు నామ సీతయ్య, నామ కృష్ణయ్య, సోదరి కమ్మ ధనమ్మ, కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మానాన్న విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అంతకుముందు నెహ్రూనగర్ లో స్వగృహం వరలక్ష్మి నిలయంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి సాగర్ జలాల్లో పిండప్రదానం చేశారు. అనంతరం కుటుంబ సభ్యులతో స్మృతివనం లో తన తల్లిదండ్రుల చిత్రపటాలను వీక్షించారు. తనకు ఎల్లప్పుడూ తల్లిదండ్రుల స్ఫూర్తి మార్గదర్శకమని నామ పేర్కొన్నారు. తన తల్లిదండ్రులు జీవితంలో ఎన్నో కష్టాలు అనుభవించి, విలువలతో జీవించారని గుర్తుచేశారు. అమ్మ త్యాగం, దాతృత్వం కుటుంబానికి ఆదర్శమని చెప్పారు. నామతన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అనేక సంక్షేమ, సేవ కార్యక్రమాలు చేస్తున్న సంగతి మనందరికి తెలిసిందే.ఈ కార్యక్రమంలో నామతో పాటు నామ తరుణ్, కనకమేడల సత్యనారాయణ, గోడ్డేటి మాధవరావు, మోరంపూడి ప్రసాదరావు, తన్నీరు రవి, వాకదాని కోటేశ్వరరావు, వనం నగేష్, రేగళ్ల కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొని నామ ముత్తయ్య–వరలక్ష్మి విగ్రహాలకు పూలు జల్లి శ్రద్ధాంజలి ఘటించారు.

## బీజేపీని వ్యతిరేకించే వారితోనే పొత్తు

**మచ్చా వెంకటేశ్వర్లు**




**టీ మీడియా, అక్టోబర్ 6,కొత్తగూడెం :** బీజేపీని ఓడించేందుకు కలిసి వచ్చే పార్టీలతో పొత్తు పెట్టుకుంటామని, బీజేపీకి వ్యతిరేకంగా కలిసి వచ్చే వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక పార్టీలతో స్థానిక ఎన్నికల అవగాహన కుదుర్చుకుంటామని సీపీఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. సోమవారం కొత్తగూడెం పట్టణంలోని మంచికంటి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ కొంత గందరగోళంగా ఉందని, ఎన్నికల కమిషన్ ఇచ్చిన షెడ్యూల్ ఆధారంగా ఎన్నికలకు సిద్ధమవుతామని తెలిపారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలకు ఒకే నోటిఫికేషన్ ఇవ్వడం వల్ల గందరగోళం నెలకొనే పరిస్థితి ఉందని, దీనిపై ఎన్నికల సంఘం పునరాలోచన చేయాలని కోరారు.బీజేపీతో అధికార భాగస్వామిగా ఉన్న ఏ పార్టీతో కూడా తాము పొత్తు పెట్టుకోమని స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తాము 120 సర్పంచ్, 80 ఎంపీటీసీలు, 8 ఎంపీపీ, 8 జడ్పీటీసీ స్థానాల్లో పోటీ చేయాలని అనుకుంటున్నామని, పొత్తు ప్రతిపాదనకు ఒప్పుకునే పార్టీలతో కలిసి పోటీ చేస్తామని, లేనిపక్షంలో ఒంటరిగానే పోటీ చేస్తామని తెలిపారు. గతంలో సీపీఎం గెలిచిన గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్ది అవార్డులను సైతం పొందామని, సుపరిపాలన అందించే సీపీఎంకు పట్టం కట్టాలని ప్రజలను ఆయన కోరారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, కె.బ్రహ్మాచారి, లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.